క్లుప్తంగా

మార్కెట్ సందర్శన



వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా కమీషన్ దుకాణాల ముందు రోడ్డుపై కూరగాయలు పెట్టిన చిల్లర వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డదిడ్డంగా దుకాణాలు పెట్టుకుంటే మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ఎలా రాకపోకలు సాగిస్తారని అసహనం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కాంటాలను సైతం తనిఖీ చేశారు. వాహనాల పార్కింగ్‌పై దృష్టి పెట్టాలని మార్కెట్ ఉద్యోగులకు సూచించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



దేశాయిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రతిభ గల 70మంది విద్యార్థులకు రూ.వేయి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేసినట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. కొత్తవాడలోని గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుమతులను శనివారం ప్రదానం చేశారు. గిర్మాజీపేట, మట్టెవాడ, దేశాయిపేట, గ్రెయిన్ మార్కెట్, క్రిస్టియన్‌కాలనీ, లక్ష్మీపురం (తెలుగు), లక్ష్మీపురం (ఇంగ్లిషు) ప్రభుత్వ పాఠశాలల్లో 10మంది విద్యార్థులకు చేయూనందించినట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, మెజీషియన్ కొల్లూరి, డీసీఈబీ చైర్మన్ నరసింహరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు



కాజీపేట: పోస్టర్ మేకింగ్, అవినీతి నిరోధంలో యువత పాత్ర అనే అంశంపై కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎఫ్‌సీఐ అధికారులు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుకు జిల్లా మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, మోహన్ కృష్ణ అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభ, దిండిగాల అనిల్, జగదీష్, ఐత రాజు, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద దుర్భర పరిస్థితులు



హన్మకొండ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద పరిస్థితులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, అక్కడ పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ కార్యదర్శులు బరుపట్ల మహేష్, టి.ఉప్పలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు డంపింగ్ యార్డ్‌ను నాయకులు శనివారం సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం అధికారులను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త తరలించే ఆటోలు ఒక్కో ట్రిప్‌కు సుమారు ఆరు గంటలు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కార్మికులకు 7నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. నిరసన కార్యక్రమంలో బాబు, సురేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాన్ డబ్బాలో చోరీ



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ రోడ్డు నంబర్ -3లో ఉన్న ఓ పాన్ డబ్బాలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం ఇద్దరు యువకులు డబ్బా తాళం పగులగొట్టి లోపల ఉన్న నగదుతో పాటు విలువైన సిగరెట్లను అపహరించారు. సీసీటీవీ ఫుటేజీని క్రైం పోలీసులకు బాధితుడు గౌని సాంబయ్య అప్పగించాడు. సుమారు రూ.10వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేశాడు.

గుట్కాల పట్టివేత

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నపేట గాంధీ విగ్రహం వద్ద గల విఘ్నేష్ కిరాణం యజమాని వెలిముల రాజు వద్ద నుంచి రూ.36 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి మట్టెవాడ పోలీసులకు అప్పగించారు.

కబ్జాకు గురవుతున్న పరికి కుంట

- ఎఫ్‌టీఎల్ పరిధిలో బండ్ నిర్మాణం
- మడికొండ రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



చెరువును ఆనుకొని ఉన్న వెంచర్



చదును చేసిన చెరువు కట్ట స్థలం (ఫైల్)



ఆక్రమణకు కుంటలో పాతిన హద్దురాళ్లు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ – ధర్మసాగర్ ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని పరికికుంట ఉంది. కుంట పక్కనే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశాడు. ఎఫ్‌టీఎల్ పరిధిలో బండ్ నిర్మించారు. బండ్ నిర్మాణానికి చెరువులోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో జేసీబీల సహాయంతో కుంటలోని మట్టిని తరలించి వెంచర్‌కు వినియోగిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా ఎవరూ స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిర్భయంగా చెరువు శిఖాన్ని ఆక్రమించి వెంచర్ నిర్మించినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుచించుకుపోతున్న చెరువు

సర్వే నంబర్ 1920లో 46.12 ఎకరాలు విస్తీర్ణంలో పరికుంట ఉండగా సుమారు 3 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. అలాగే, కొంతమంది చెరువు కట్టను తొలగించి సుమారుగా 10గుంటల వరకు పట్టా చేయించి మరొకరికి అమ్ముకున్నట్లు స్థానిక రైతులు వాపోతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఏకంగా చెరువులోనే హద్దురాళ్లను పాతారని తెలిపారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వీఆర్‌ఓ వ్యవస్థ రద్దు అయిన తర్వాత భూ కబ్జాదారులు ఆక్రమణలకు తెగబడుతున్నారని చెబుతున్నారు. గతంలో పరికుంట చెరువును రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. ఇప్పుడు ఆ హద్దులు కనుమరుగయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి చెరువు హద్దులు గుర్తించి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు

విద్యారణ్యపురి: విద్యార్థులు మాదకద్రవ్యాలు, వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని యాంటీ నార్కోటిక్స్ వరంగల్ బ్యూరో డీఎస్పీ సైదులు సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నార్కోటిక్స్ బ్యూరో, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, హెల్పింగ్ హ్యాండ్స్, డీ అడిక్షన్ సెంటర్ విభాగాల సౌజన్యంతో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, మాదక ద్రవ్యాలు, వ్యసనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై వీడియోను ప్రదర్శించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, రవీందర్, నెహ్రూ యువకేంద్రం ఆఫీసర్ సీహెచ్.అన్వేష్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్, ఎన్‌జీఓ హెల్పింగ్ హ్యాండ్స్ రాము, సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ అహ్మద్, డీఎంఅండ్‌హెచ్‌ఓ లలితాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌రావు, సైకాలజిస్టు డాక్టర్ మనోజ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ చిన్న, రాంచందర్, సోషల్ వర్కర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, కాంట్రాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



వరంగల్: దళిత, గిరిజన, బీసీ, మైనార్టీల్లోని పేదలను విస్మరించి లక్షల రూపాయలు తీసుకుని అనర్హులకు డబుల్ బెడ్రూంలు కేటాయిస్తున్న కాంట్రాక్టర్, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామానికి చెందిన టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపట్ల అంజయ్య కోరారు. ఈమేరకు కలెక్టర్ సత్యశారదను కలెక్టరేట్‌లో శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో సర్వే నంబర్ 52లోని భూమిని గతంలో పేదలకు కేటాయించారని, ప్రస్తుతం అందులో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో తహసీల్దార్, కాంట్రాక్టర్ కుమ్మక్కై, అనర్హుల వద్ద రూ.లక్షలు తీసుకుంటూ ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

అనారోగ్య సమస్యలపై అశ్రద్ధ వద్దు



కంటి పరీక్ష చేయించుకుంటున్న సీపీ

వరంగల్ క్రైం: నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎదురయ్యే అనారోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ వహించొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ సిబ్బంది, హోంగార్డ్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, విశ్రాంతి పోలీస్ ఉద్యోగులు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని భీమారంలోని శుభం కల్యాణ వేదికలో శనివారం ఏర్పాటు చేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి, శరత్ మాక్స్ విజన్ ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల కోఆర్డినేటర్‌గా వెంకటేష్



మడికొండ: ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల కోఆర్డినేటర్‌గా మడికొండ గ్రామానికి చెందిన వెన్నమల్ల వెంకటేష్ ఎంపికయ్యారు. ఈమేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా భిక్షపతి



హసన్‌పర్తి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన దీకొండ భిక్షపతి నియమితులయ్యారు. ఈమేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ శనివారం ప్రకటించారు.

గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగ్ గౌడ్



కాజీపేట: తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన చిర్ర నర్సింగ్‌గౌడ్ శనివారం నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపిగౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖిలా వరంగల్: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న సూచించారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట అంగన్‌వాడీ కేంద్రంలో సఖి సెంటర్ సేవలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు సఖి కేంద్రం అండగా ఉందని తెలిపారు. బాధిత మహిళలు 181 నంబర్‌లో సంప్రదించి తక్షణ రక్షణ పొందాలని తెలిపారు.

ఆయుర్వేద పీజీ కౌన్సెలింగ్ ప్రారంభించాలి



కాశిబుగ్గ: ఆయుర్వేద పీజీ కౌన్సెలింగ్ ప్రక్రియను కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ అధికారులు వెంటనే ప్రారంభించాలని జిజ్ఞాస సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్‌కు శనివారం వినతిపత్రం అందజేయగా ఆయన నిరాకరించారు. ఈ సందర్భంగా జిజ్ఞాస రాష్ట్ర కో కన్వీనర్ రోహిత్ బాస్రే మాట్లాడుతూ సెప్టెంబర్ 4న అన్ని రాష్ట్ర ఆరోగ్య విశ్వవిద్యాలయాల్లో, సెప్టెంబర్ 19 నుంచి ఆయుర్వేద పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్ఎం) ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ ఇప్పటివరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించలేదని తెలిపారు. దాంతో వైద్య విద్యార్థులు భవిష్యత్తులో నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్‌టీఈటీ)కు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

కమిటీలో అన్ని పార్టీలకు అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హసన్‌పర్తి: ఇందిరమ్మ కమిటీల్లో అన్ని రాజకీయ పార్టీలకు అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ కోరారు. ఈమేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజనీకుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల్లో పారదర్శకత పాటించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో 66వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, పీఏసీఎస్ డైరెక్టర్ మేకల భగవాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శరత్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నాగరాజు, చాతళ్ల వేణుగోపాల్, నాయకులు మూల దేవేందర్, గోపి, రఘు, రాజేష్, గన్నోజు రవీందర్, ప్రశాంత్‌రెడ్డి, మహేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులు చేయడం శోచనీయం



వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

వరంగల్: రాష్ట్రంలోని హిందూ దేవాలయాలపై దాడులు చేయడం శోచనీయమని, అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ ఉమ్మడి వరంగల్ విభాగ్ సహ ప్రముఖ్ శ్రీరాం ఉదయ్‌కుమార్ కోరారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హనుమకొండ చౌరస్తాలో మతోన్మాది దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలను కూలగొట్టే వ్యక్తులను వదిలిపెట్టి అమాయక హిందువులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వీహెచ్‌పీ వరంగల్ మహానగర అధ్యక్షుడు కేసిరెడ్డి జైపాల్‌రెడ్డి, కార్యదర్శి వెలగందుల రాజు, సహ కార్యదర్శి ఏడెల్లి సందీప్‌రెడ్డి, భజరంగ్‌దళ్ వరంగల్ మహానగర్ సంయోజక్ కొల్లూరి ఆదిత్యసాయి, విశ్వవిద్యాలయ ప్రఖండ కార్యదర్శి కనుకుంట్ల వెంకటేశ్వర్లు, ధర్మాచార్య ప్రముఖ్ గూడూరు రాకేష్, గన్ను రామానుజం, వలస అశోక్, నాగపురి వెంకటేష్, తారక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు చొరవ చూపాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులను తక్షణమే విడుదల చేసేలా చొరవ తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీం నవీన్, యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు రాచకొండ రంజిత్, వేల్పుల చరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ముగిసిన జాతీయ విద్యార్థి సదస్సు

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ విద్యార్థి సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు తెలంగాణలోని వివిధ కళాశాలలకు సుమారు మూడువేల మంది విద్యార్థులు హాజరై పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టులు రూపొందించారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతర సాధనతోనే కొత్త ప్రాజెక్టులు రూపొందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ శ్రీలత, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ నరసింహరావు, డాక్టర్ టి.మధుకర్‌రెడ్డి, డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ప్రభాకరాచారి, కిట్స్ చాప్టర్ ప్రెసిడెంట్ ఎ.అభిచరణ్, టెక్నికల్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు నిషాత్ సుల్తానా, వి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక సమాఖ్య కౌన్సిల్

ఖిలా వరంగల్: నర్సంపేట పట్టణంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కౌన్సిల్ సమావేశాలను ఆదివారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా సభ్యుడు రాచర్ల బాలరాజు తెలిపారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు హనుమాన్ జంక్షన్‌లో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో ఆదివారం ఉదయం అమరవీరుల స్తూపం వద్ద అరుణోదయ సాంస్కృతిక కళాకారుల ప్రదర్శన, మాధన్నపేట రోడ్డులోని సిటిజన్ క్లబ్‌లో సమాఖ్య కౌన్సిల్ సమావేశం జరగనుందని వివరించారు. కార్యక్రమంలో గంధ్రతి హరిబాబు, బన్న నర్సింగం, సాంబయ్య, కృష్ణ, ఎండీ.అక్బర్, అమర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

హసన్‌పర్తి: శాంతిభద్రతల్లో పోలీసులకు ప్రజలు సహకరించాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కోరారు. ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను భీమారానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంగాల విక్టర్ బాబు, రామకృష్ణ, చాతళ్ల వేణుగోపాల్, చింతల రవి, పల్లపు రవికుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



కాజీపేట: కాజీపేట రైల్వే లైన్‌పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి జిల్లా ప్రజలకు అంకితం చేయాలని సీపీఎం మండల ఇన్‌చార్జ్ ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నాయిని దృష్టి సారించి పూర్తయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో జంపాల రమేష్, సంటి రవి, ఇందిర, ఎండీ.అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎంబాడి రవీందర్ కుటుంబానికి పరామర్శ

ఖిలా వరంగల్: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ కుటుంబ సభ్యులను తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టీ.రమేష్ బాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దాతలకు సన్మానం



హన్మకొండ అర్బన్: హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో ఇటీవల నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన దాతలు, భక్తులను ఆలయ అర్చకులు, వేద పండితులు నాగిళ్ల శణ్ముక పద్మనాభ అవధాని ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథులను అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మాలల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్యాల కృష్ణ

కాజీపేట రూరల్: హసన్‌పర్తి చింతగట్టులో కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరగనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మాల మహానాడు కాజీపేట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాజీపేట రైల్వే రామాలయంలో శనివారం జరిగిన మాలల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని జరుగుతున్న కుట్ర నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు పప్పుల గోవర్ధన్, సీహెచ్.కొమ్మాలు, గుడిపాటి కుమారస్వామి, ఈసారపు సత్యనారాయణ, పడిదెల శేఖర్, కొత్త రవి, పోతుల సాంబయ్య, ఉప్పల్‌రావు, కాందారి రాజమౌళి, జానపట్ల యాదగిరి, బోయిని వెంకట్రావు, బాదం కుమార్, బండారి నర్సింగరావు, మన్నె ఓదెలు, రాంచందర్, జగపతిరామ్, దార్ల వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



కాశిబుగ్గ: బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన వస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తెలిపారు. నాయకుడు సముద్రాల పరమేశ్వర్ ఆధ్వర్యంలో కాశిబుగ్గలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్ముతున్న ప్రజలు.. పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కుసుమ సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, సిద్దం నరేష్ పటేల్, కోట సతీష్, బైరి శ్యామ్, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

హసన్‌పర్తి: క్షేత్రస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అని కొనియాడారు. డివిజన్ అధ్యక్షుడు తిరుపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మేకల హరిశంకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.